# "మ్యూసింగ్స్" ★

జనమంచి

వర్షా లివ్వలేనివి నీడల నీరదాలేనా! అవిగో ఉరుములు నోరు తెరిచి మెర్పుల మాటలేవో పల్కుతున్నాయి! ఏవీ నా పువ్వులు! ఎక్కడ దాచారు నా విరి కన్నెలను! మంచు తెరల్లో మణిగి పోయాయా? చంద్ర గాడ్పులలో ఎండిపోయాయా? ఏవీ నా పూకన్నెల చేలాంచలాల లాలస వీవనలు! ఈ తనువుకి సోకడం లేదేం!

అదిగో ప్రాక్ ప్రాంగణ ద్వాః కవాటం తెరచి తొంగి చూస్తున్నాడు పవన తనూజుడు రావోయీ! తుషారధరా! రావోయీ! వెదురు గుబురు పొదలలో చేరి వంశిపూరించు కదంబాలు కందళిత హృదయాలతో నీ కీర్తనలో నర్తన మొనరిస్తాయి!

అరెరే! ఏమిటీ పుష్ప సమూహం? ఏమిటీ తన్మయ నర్తనకేళి! ఎక్కడ దాగొని దోబూచిలాడుతున్నారింత వరకూ! పచ్చిక తివాచీ పురివిప్పి పరచుకుంది! రండి! రండి! నర్తించండి! మీరంతా ఇంతవరకూ ఏలోకాల రంగు హంగుల హొయలుచో సౌందర్యాన్ని దిద్దుకుంటు న్నారు! ఆ లోకం పేరేమిటి ఎంత సౌందర్యపిపాస! నన్నుకూడా తీసుకుపోతారా మీతో వచ్చేస్తాను? మీ హృదయం— అటువంటి పరిమళ భరితమైనది కావాలి? మీతో చేరి ఈ మానవత్వం పోగొట్టుకోవాలని వుంది! నన్ను భూమి పట్టుకునుందా? లేక నేను భూమిని పట్టుకు న్నున్నానా? ఈ జగత్తంతా నాకపరిచితము! నేను అపరిచితుణ్ణి! పూలూ! మీరు ఇట్టే వస్తారు, ఇట్టే మాయమౌతారు! ఎందుకు నన్నిలావుంచి ఆశను ఎగసనతోస్తారు? నీలిమాకాశం చూసి రంగు మార్చుకుంటారు అరుణారుణ కాంతులు చూసి తరుణ యవ్వనంతో తనువులు మర్చిపోతారు మెడవాల్చి గుండెలోతుల్లో, ఏదో పోగొట్టుకున్న దానికై నిరంతరాన్వేషణ సాగిస్తాను నన్నెందుకు మీరు వదలి వెళ్ళిపోతారు? జాలిలేదు! నాచుట్టూరా కవాటాలు బంధించి వున్నాయి నన్నుకూడా ఆ లోక ఆహ్వానానికి అతిథిగా తీసుకుపోరూ!

ఆ వెచ్చని వెల్తురే ఆ గాలే, ఆకాశమే, ఆవర్షమే ఆతుషారమే నన్ను తాకుతూంది కాని ఇదెమిటి! పులకరింతల బదులు ఈ తిమ్మెర లేమిటి! పరమేశ్వరుడు ప్రాణి కోటికంతటికీ ఒకే జీవామృతం చిలికాడే! పచ్చికలో పరుగిడే జీవధార నాలో నా నాళాలలో ప్రవహించదా! పిల్లతెమ్మరలో పల్టీలు కొడుతూ తేటిజంటలు, పూవౌ సంగుతూన్న మధు విందు నారగిస్తున్నాయి మానవుని హృదయం ప్రేమమధు భరితమన్నారు! అంతా మిధ్య!

సృష్ట్యాదిలో మనం ఆపద్బాంధవులము ఆదిలో అనవరతమూ అనుకోని అన్యోన్యంతో కలసిమెలసి ఉండే వాళ్ళము అప్పుడు మీకుండే ముగ్ధ హృదయమే నాకూ వుండేది, కాని ఈ పరిణామంలో వాతావరణ సమర్ధింపులో నా హృదయం చివికి చితికి పోయింది మీరు నన్ను గుర్తుపట్టలేరు కదూ ఇప్పుడు! ప్రథమ ప్రభాతంనాటి ఆనందం ఇప్పుడు లేదు అనాడేకదూ మనం ఒకరికొకరం ఆశ్చర్యంతో చూసుకున్నాము? ఆనాడేకదూ చూపుమేర కనపడే సృష్టి వైచిత్రినంతా కని విస్తుపోయాము అనాడే కదూ అంబర పథాల్లో వర్తులనృత్యం చేస్తున్న తారకల మైత్రి కోసం ఊర్ధ్వంలోకి చూస్తూ, ఆకాశపుటంచులు పట్టుకు పైకెళ్ళేందుకు పరుగెత్తాము ప్రకృతికాంత సౌందర్యాన్ని చూసి మురిసిపోయి గొంతు విప్పాము, అదే మొదటిసారి మన గొంతువాని తీపి శ్రవః పేయమని తెలుసుకున్నాము

విరి చేడియలారా! పలుకరించరేమి! చిన్ననాటి స్నేహం వాత్సల్యం మర్చిపోయారా! కాదు! కాదు నేనే మారిపోయాను! నేనే మనమొదటి భాష మర్చిపోయాను నేనే మీ వాతావరణంనుండి దూరమై పోయాను ఇప్పుడు అమానుషమైన కాంక్ష నాలో చెలరేగింది! ఈ కాంక్షనే మేము నాగరికత అంటున్నాము! ఈ నాగరికత పరుగుల్లో నశించిపోతూన్నది మేమే ఈ కాంక్ష ఈ నాగరికత అశనిపాతమైంది! రాను రాను ఆత్మఘాతమైంది! నన్ను ద్వేషిస్తున్నారు కదూ మీరు! మానవ వాతావరణానికి దూరంగా వుండాలనే మీనిశ్చయము! మీకుపరిణామంలేదు! మీరప్పుడే పూర్ణాకృతి చెందారు! అందుకే మీరు పరమేశ్వరుని అనుంగుబిడ్డలు! అందుకే లాలనతో ఆయన మిమ్ములను మూర్ధంమీద పెట్టుకుని ఆదరిస్తాడు మీతోపాటు కలసిమెలసి ఆడుతూ పాడుతూంటాడు నాకు పునరవతరణం కల్గించరూ!

నా అపరాధమేమిటి! నన్ను పతితుణ్ణిగా పరిగణిస్తున్నారా? నాకీప్రవాస మెంతకాలం? మీ లోకంలో నాకు తావులేదూ? మీలోకపు బాటనంటి రానా? మీదిపూల బాటా! ఔను! నాకఠిన పాదశిలల క్రిందపడి నలిగి రాలిపోతారు!